సాక్షి అనకాపల్లి

శనివారం । 13 । జనవరి । 2024




ఘనంగా కూడారై ఉత్సవం

సింహాచలం: సింహాచలేశుని సన్నిధిలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సహస్ర దీపాలంకరణ

విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం సహస్రదీపాలంకరణను వేడుకగా నిర్వహించారు.



వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్‌కుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టం 30 నుంచి 30.2 డిగ్రీలు, కనిష్టం 22.4 నుంచి 22.6, తేమ శాతం 81 నుంచి 85, గాలి గంటకు 4 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

కార్మిక సెస్ వసూలు చేయాలి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం

తుమ్మపాల: కార్మికుల సంక్షేమం కోసం విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను ఉపయోగించుకుంటున్న అన్ని శాఖల నుంచి కార్మిక సెస్ వసూలు చేయాలన్నారు. అదేవిధంగా నిర్మాణాలకు సంబంధించి పని ప్రారంభించక ముందే సెస్ కట్టించుకోవాలన్నారు. భవన నిర్మాణాలను ముందుగానే రిజిస్టర్ చేయించాలన్నారు. కార్మికుల సంక్షేమానికి సంబంధించి ఏమైనా బిల్లులు పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వసంతరావు, సోషల్ సెక్యూరిటీ అధికారి పి.సుజాత, గృహ నిర్మాణ శాఖ ఎస్‌డీసీ కె.రమాదేవి, డ్వామా పీడీ ఈ.సందీప్, జీవీఎంసీ జెడ్‌సి. వెంకటరమణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

- ఎస్పీ మురళీకృష్ణ హెచ్చరిక



అనకాపల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందేలు, పేకాట, బల్లాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. సులభంగా డబ్బు సంపాదించాలని అత్యాశకుపోయి పందేలు కాసి ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 100, 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

16న బొజ్జన్న కొండ వద్ద బౌద్ధ మేళా



మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, సంఘు సభ్యులు

అనకాపల్లి: మండలంలో శంకరం బొజ్జన్న కొండ వద్ద ఈ నెల 16న బౌద్ధ మేళా నిర్వహించనున్నట్టు విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య సహాయ కార్యదర్శి బల్లా నాగభూషణం తెలిపారు. ఈ మేళాకు ముఖ్య అతిథులుగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను, ఎంపీ సత్యవతిని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆరోజు ఉదయం సాయంత్రం వరకు జరిగే మేళాలో బుద్ధుని పంచశీల సూత్రాలపై బుద్ధ గయ నుంచి వస్తున్న బౌద్ధ భిక్షువులు వెనరబుల్ జ్ఞానదీప్ మహాథేరో, వెనరబుల్ బోధి రత్న మహాథేరో ప్రసంగిస్తారన్నారు. ముందుగా ఈ మేళా కరపత్రాన్ని ఎంపీ బీవీ సత్యవతి తన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బౌద్ధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బండారు బెండు వంచారు

- **జనసేన పొత్తుతో పెందుర్తి టికెట్ కట్**
- **మాడుగులకు వెళ్లాలంటూ అధినేత ఆదేశం**
- పెందుర్తి కావాలంటూ బండారు పట్టు
- కష్టమేనంటున్న సొంత పార్టీ నేతలు
- రోజాపై వ్యాఖ్యల తర్వాత మరింతగా దిగజారిన పరిస్థితి
- బండారు రాజకీయ చాప్టర్ క్లోజ్ అంటున్న సన్నిహితులు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సీటు కోసం నోటికి పని చెప్పి... వయస్సును కూడా మరచిన బండారు బెండు వంచింది సొంత పార్టీ. రానున్న ఎన్నికల్లో పెందుర్తి నుంచి టికెట్ లేదంటూ ఆ పార్టీ అధినేత బండారుకు తేల్చి చెప్పినట్టు సమాచారం. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఈ సీటును ఆ పార్టీకి కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల రాజకీయంలో ఉండాలంటే మాడుగుల నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తేల్చిచెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, మాడుగుల నుంచి బరిలోకి దిగేందుకు బండారు ససేమిరా అంటున్నారు. పెందుర్తి టికెట్ కావాలంటూ అధిష్టానం వద్ద మొర్కులు కొట్టేసేందుకు వయస్సును కూడా మరచి మంత్రి రోజాపై అవాకులు చెవాకులు పేలారు. అయినప్పటికీ బండారుకు గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. పైగా ఆయన వ్యాఖ్యలతో మరింతగా పరిస్థితి దిగజారిపోయిందంటూ సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటే ఇక బండారు సత్యనారాయణమూర్తి రాజకీయ చాప్టర్ ముగిసిన అధ్యాయమేనని ఆయన వర్గీయులే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా సీటు కోసం నోటికి పనిచెప్పి ఉన్న కొద్దిపాటి గౌరవాన్ని దిగజార్చుకున్నా ఫలితం లేకపోవడంతో తన సన్నిహితుల వద్ద పార్టీ అధినాయకత్వంపై మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మంత్రి రోజాపై వ్యాఖ్యల తర్వాత **బండారు రాజకీయ** గ్రాఫ్ మరింత **వేగంగా దిగ**జారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పెందుర్తి సీటుపై జనసేన కన్ను

గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలవడంతో ఈ సీటు కోసం జనసేన పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానంటూ పంచకర్ల రమేష్‌బాబు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అధికారికంగా పార్టీ ప్రకటించనప్పటికీ ఈ సీటు తనదేనని ఆయన చెప్పుకుంటున్నారు. అయితే, సీటు జనసేనకు కేటాయించినా తెలుగుదేశం పార్టీ వర్గాలు సహకరించేది కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ సీట్ల వ్యవహారం కొలిక్కిరాకపోవడంతో తెలుగుదేశం–జనసేన కలిసి జెండాలు పట్టుకుని రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. ఇక్కడ మాత్రం ఎక్కడా కలిసి కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ అధికారికంగా బండారుకు ఝలక్ ఇస్తే.. జనసేన అభ్యర్థికి సహకరించడం కష్టమేనని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఇరు పార్టీల పొత్తుకు ఇక్కడి నుంచే బీటలు పడటం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

వాస్తవానికి గతంలో పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా కూడా బండారు పనిచేశారు. గత ఎన్నికల్లో యువకుడైన అదీప్‌రాజ్ చేతిలో మట్టికరిచారు. అప్పటి నుంచి ఎలాగోలా వార్తల్లో ఉండేలా బండారు నోటికి పనిచెబుతూ వస్తున్నారు. ప్రభుత్వంపై ఏదో ఒక ఆరోపణ చేస్తూ వార్తల్లో నిలిచే విధంగా చూసుకున్నారు. అయితే, ప్రజల్లో మద్దతు కోల్పోవడంతో ఆయనకు సీటు ఇచ్చినా గెలిచే అవకాశం లేదని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసినా ఆరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. ఆయన కుమారుడు వ్యవహరించిన తీరు ప్రజల్లో వ్యతిరేకతను మరింతగా పెంచింది. ఆయన అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. కేవలం భూకబ్జాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే పెందుర్తి నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలంటూ జనసేన పార్టీ పట్టుబట్టింది. అయితే, పెందుర్తి నుంచి టికెట్ ఇవ్వకపోతే తన సత్తా చూపిస్తానంటూ బండారు సన్నిహితుల వద్ద తేల్చిచెబుతున్నట్టు తెలుస్తోంది. వయసైపోయిన నేపథ్యంలో తనకు రాజకీయ భవిష్యత్ లేకుండా పోతుండటం.. ఇప్పటికీ వారసత్వంగా కొడుకును పరిచయం చేయకపోవడం బండారును చాలా బాధ పెడుతున్నట్టు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం



ద్రోణంరాజు శ్రీవాత్సవ్



పేడాడ రమణకుమారి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగ కమిటీని నియమించారు. ఇప్పటికే విశాఖ జిల్లాకు చెందిన కొండా రాజీవ్‌గాంధీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనతో పాటు విశాఖకు చెందిన ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌ను మరో ఉపాధ్యక్షుడిగా నియమించారు. వీరితో పాటుగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాండ్రేగుల యశ్వంత్ (అనకాపల్లి), కార్యదర్శులుగా పలకా రవి (అనకాపల్లి), జగ్గపల్లి నరేష్(విశాఖ), సంయుక్త కార్యదర్శిగా భీశెట్టి జగన్(అనకాపల్లి), రంబుక్త ప్రభాకర్ నాయుడు(విశాఖ)లను నియమించారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కమిటీ..

సాక్షి, విశాఖపట్నం: విశాఖ జిల్లాకు చెందిన మంతెన మాధవి వర్మ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఆమెతో పాటు విశాఖకు చెందిన పేడాడ రమణకుమారిని మరో ఉపాధ్యక్షురాలిగా నియమించారు. వీరితో పాటుగా పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి అలియాస్ శిరీషను నియమించారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

యువజనోత్సాహం

IIలో



రేవుపోలవరం తీరంలో వివేకానందుని విగ్రహం వద్ద యువజనోత్సవాలు నిర్వహిస్తున్న మెరైన్ పోలీసులు

వివేకానందుని జయంతి సందర్భంగా జిల్లా అంతటా యువజనోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వివేకానంద స్వామి బోధనలను యువతకు వివరించారు. ఆయన అడుగుజాడల్లో నడిచి దేశానికి పేరు తేవాలని ఉద్బోధించారు.

సంక్షేమాభివృద్ధికి చిరునామా ఆంధ్రప్రదేశ్



రైవాడలో అభివృద్ధి, సంక్షేమ పథకాల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



శిలాఫలకం ఆవిష్కరించి దేవరాపల్లి ఒడ్డు చింతల వీధి తారురోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు
- ఆరు గ్రామాల్లో 24 అభివృద్ధి పనులు ప్రారంభం
- కోలాటం, తీన్మార్ వాయిద్యాలతో సందడిగా కార్యక్రమాలు

దేవరాపల్లి: విప్లవాత్మక సంస్కరణలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి చిరునామాగా మార్చారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఆరు గ్రామాల్లో రూ.13.95 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసిన 24 అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు, సన్నాయి మేళం, తీన్మార్ వాయిద్యాల నడుమ జాతరను తలపించేలా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరిగాయి. రైవాడలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. నాలుగున్నరేళ్లలో రూ.15.63 కోట్లతో సంక్షేమ, అభివృద్ధిపథకాల రూపంలో అందించిన వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.45 లక్షలతో బేతపూడిలో నిర్మించిన మంచినీటి ట్యాంక్, ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. గరిశింగిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, చినగంగవరంలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. దేవరాపల్లిలో దేవరాపల్లి–రైవాడ రోడ్డు నుంచి రూ.1.02 కోట్లతో నిర్మించిన తారురోడ్డును, రూ.30 లక్షలతో నిర్మించిన ఆర్టీసీ కాంప్లెక్స్ అప్రోచ్ రోడ్డు, రూ.30 లక్షలతో దేవరాపల్లి పంచాయతీ కార్యాలయం నుంచి శ్మశాన వాటిక సీసీ రోడ్డు వరకు, రూ.30 లక్షలతో ఎంపీపీ పాఠశాల నుంచి శ్మశానవాటిక సీసీరోడ్డు వరకు నిర్మించిన సీసీరోడ్ల శిలాఫలకాలను ఆవిష్కరించి ప్రారంభోత్సవం చేశారు. దేవరాపల్లిలో రూ.43 లక్షలతో వేర్వేరు అంతర్గత సీసీ రోడ్లు, రూ.3 లక్షలతో నిర్మించిన బీరకవీధిలో మహిళా మండలి భవనాన్ని, రజక వీధిలో రూ.2 లక్షలతో మరమ్మతులు చేపట్టిన మహిళా మండలి భవనాలను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. దేవరాపల్లిలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఎ. కొత్తపల్లిలో రూ.1.20 కోట్లతో నిర్మించిన మంచినీటి ట్యాంక్, మంచినీటి కుళాయిలను ఆయన ప్రారంభించారు. పెదనందిపల్లి నుంచి ఎ. కొత్తపల్లి, రావాడపాలెం మీదుగా ముషిడిపల్లి వరకు రూ.2.96 కోట్ల వ్యయంతో నిర్మించిన తారురోడ్డును శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల మధ్య ఉన్న మట్టి రోడ్లన్నింటిని దాదాపుగా తారురోడ్లుగా నిర్మించడంతో పాటు తాగునీరు, అంతర్గతసీసీ సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, చల్లా లక్ష్మి, చింతల సత్య వెంకటరమణ, గూడెపు రాము, సోమిరెడ్డి సన్నిబాబు, మతల దేముడమ్మ, ఎంపీటీసీలు మొల్లి కృష్ణమూర్తి, కోలా గోపి, బొడ్డు లక్ష్మి, వైస్ ఎంపీపీలు చింతల బుల్లి లక్ష్మి, ఉగ్రాకుల గంగాభవాని, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.సింహాచలంనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గొర్రపోటు రమాదేవి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, వేచలపు అప్పలనాయుడు, గుల్లేపల్లి మురళి, సోమిరెడ్డి పేరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి శిక్షణకు పోర్టు సాయం



సెమ్స్ ప్రతినిధులకు చెక్ అందిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు

సాక్షి, విశాఖపట్నం : యువతను ప్రోత్సహించడంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని వీపీఏ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని పోర్టులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.64.38 లక్షల చెక్కును సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారీటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్) అధికారులకు అందజేశారు. ఈ నిధులతో కొరియర్ సూపర్ వైజర్ ఆపరేషన్స్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ పికర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సి ఆపరేటర్, వెర్టికల్ మెషీనింగ్ సెంటర్, ఎంఎంఏడబ్ల్యూ, స్వామ్ వెల్డర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ తదితర కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తామని సెమ్స్ అధికారులు తెలిపారు. శిక్షణా కాలం మూడు నెలల పాటు ఉంటుందని పోర్టు చైర్మన్ తెలిపారు. సెమ్స్‌తో కలిసి విశాఖపట్నం పోర్టు అథారిటీ నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని పోర్టు చైర్మన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, ఎఫ్ఏ అండ్ సీఏఓ శరగడం శివకుమార్ , సెమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పండగే..

తెలుగు వారికి సంక్రాంతి పండగ ఎంత ప్రత్యేకమో.. ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామ తీర్థాలు అంతే విశిష్టమైనవి. భోగి రోజున ప్రారంభమైన తొలి తీర్థం నుంచి ఒకటే సందడి... ఏ ఊరెళ్లినా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలమే.. ఎటు చూసినా జనసందోహమే.. ప్రతి ఇంటా బంధువులు, అల్లుళ్లు, కోడళ్లతో ఒకటే హడావుడి.. ఇలా మూడు మాసాలపాటు విందు వినోదాలు, అతిథి మర్యాదలతో బిజిబిజీగా పల్లెలు కనిపించనున్నాయి.

- సంక్రాంతి తీర్థాలకు ముస్తాబవుతున్న గ్రామాలు
- గ్రామీణులకు ఆటవిడుపుగా తీర్థాలు..
- రేపటి నుంచి గ్రామీణ జిల్లాలో ప్రారంభం
- నేటికీ చెక్కు చెరగని తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు



సంక్రాంతి తీర్థాలకు శ్రీకారం చుట్టేది చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచే..



గిర్రున తిప్పే రంగులరాట్నాలు



పండగ కళ తెచ్చే రంగుల బెలూన్లు

చోడవరం: ఏడాదంతా ఎండనకా వాననక కాయకష్టం చేసి అలసిపోయే పల్లె ప్రజలకు సంక్రాంతి పండగతో ఆరంభమయ్యే తీర్థాలు ఎంతో ఆటవిడుపును కలిగిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో వారికి పార్కులు, బీచ్‌లు, ఇతర వినోద విహార ప్రాంతాలు అందుబాటులో ఉంటాయి. పల్లెల్లో ఇటువంటివేవీ ఉండవు. ఈ నేపథ్యంలో ఏడాదికొకసారి వచ్చే సంక్రాంతి తీర్థాలంటే గ్రామీణ ప్రజలకు ఎంతో ఇష్టం. చిన్నాపెద్దా అందరికీ ఈ తీర్థాలు మహానందాన్ని కలిగిస్తాయి. తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకే కాకుండా సమీప గ్రామాల్లో నిర్వహించే వాటికి కాలినడకన సైతం వెళ్లి మరీ చూసి సంబరపడతారు. తీర్థాలంటే గ్రామాల్లో ఒక రకమైన బంధువుల మధ్య ప్రేమానుబంధాలు కలిపే పండగలని చెప్పవచ్చు.

భోగి రోజున చోడవరం విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం...

ఏటా భోగి పండగ నుంచి గ్రామాల్లో తీర్థాలు ప్రారంభమవుతాయి. ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద జరిగే తీర్థం నుంచే జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ప్రారంభమవుతాయి. కాణిపాకం వినాయకుని తర్వాత అంతటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద భోగి రోజైన ఆదివారం మొదట తీర్థం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. 40 రోజులకు పైబడి రోజుకు రెండు, మూడు గ్రామాల్లో అన్ని చోట్ల తీర్థాలు నిర్వహిస్తారు. చిన్నచిన్న గ్రామాల్లోనైతే ఒక తీర్థమే నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఆలయాలు, గ్రామదేవతల గుడిల వద్ద, ప్రముఖుల సంస్మరణార్థం, జాతీయ నాయకులు, అభిమాన నేతల విగ్రహాల వద్ద ఈ తీర్థాలు నిర్వహిస్తుంటారు.

తీర్థమంటే వినోదమే..

గ్రామీణ తీర్థమంటే ప్రతి ఒక్కరికీ వినోదం కలిగిస్తోంది. గిర్రున తిప్పే రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్, పట్టాలపై పరుగులు తీసే రైళ్లు, నోరూరించే పంచదార చిలుకలు, గ్రామీణులకే అందుబాటులో ఉండే నెయ్యిచెక్కీలు, ఖర్జూరం దుకాణాలతోపాటు పండగ వాతావరణాన్ని తీసుకువచ్చే రంగురంగుల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించే ఎడ్ల బళ్లు, గుర్రం పందేల పోటీలు చిన్నాపెద్దా అందరికీ హుషారు కలిగిస్తాయి. ఈ తీర్థాలకు పిల్లలను తీసుకెళ్లి వారికి బెలూన్లు, రకరకాల బొమ్మలు, తినుబండారాలను కొనిచ్చే మధురానుభూతి ప్రతి ఒక్కరిలో తమ బాల్యాన్ని గుర్తుకు తెస్తోంది. బంధుమిత్రులను ఆహ్వానించి విందు వినోదాలతో అతిథి మర్యాదలు చేయడంతో గ్రామమంతా సందడి నెలకొంటోంది. మందుబాబుల విందులు తోడవ్వడంతో వారి హడావిడి అంతా ఇంతా కాదు. బతుకుదెరువు కోసం, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన వారు కూడా తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకు విధిగా హాజరై ఎంతో ఆనందంతో గడుపుతారు. ఈ తీర్థాల జోరు గ్రామీణుల్లో ఎంతో హుషారును నింపి కొత్త ఉత్సాహంతో తిరిగి పనీపాటల్లో పాల్గొనేలా చేస్తాయి. సాంకేతిక యుగంలో పరుగులు తీస్తున్న మనం నేటికీ గ్రామీణ సంస్కృతిని కాపాడుకుంటూ.. బంధు, బంధుత్వాలను మరింత దగ్గర చేర్చడానికి ఈ తీర్థాలు దోహదం చేస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

- మౌలిక వసతుల కల్పనకు కృషి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: క్రీడల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలబాలికలు, యువతీ యువకులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా జిల్లాలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. అలాంటి ఉద్దేశంతోనే ఆడుదాం–ఆంధ్రా పోటీలు జరుగుతున్నాయన్నారు. ప్రత్యేక శిబిరాలు నిర్వహించి క్రీడల్లో యువతకు శిక్షణ ఇవ్వాలన్నారు. సచివాలయాల పరిధిలో క్రీడలకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఈవో మహాలక్ష్మమ్మ, డీపీవో ఆర్.శిరీషరాణి, ఏపీఐఐసీ జెడ్ఎం త్రినాథ్, పీఆర్ ఏఈ వీరునాయుడు, ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, డీఎస్‌డీవో ఎల్‌వి రమణ, పవర్ లిఫ్టర్ కుసుమ పాల్గొన్నారు.



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి చెక్కు అందిస్తున్న చెట్టినాడ్ సిమెంట్స్ ఏజీఎం నరసింహారాజు

హాస్టల్ అభివృద్ధికి రూ.15 లక్షల విరాళం

కశింకోటలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు చెట్టినాడ్ సిమెంట్ కార్పొరేషన్ రూ.15 లక్షల సీఎస్సార్ నిధులను అందజేసింది. సంస్థ ఏజీఎం (హెచ్ఆర్) నరసింహరాజు శుక్రవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిసి చెక్కు అందించారు. తరగతి గదులు, స్టడీ రూమ్, బాత్‌రూముల మరమ్మతులు, పెయింటింగ్ నిమిత్తం ఈ నిధులను వెచ్చించాలని వారు కోరారు. సీఎస్సార్ నిధులను అందించినందుకు వారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, కంపెనీ ప్రతినిధులు ధనంజయ్, కృపానందం పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

మహారాణిపేట : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా జడ్జి ఎం.శేషమ్మ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఐసీడీఎస్ పీడీ సమావేశ మందిరంలో ప్రైవేటు నర్సింగ్ హోమ్ స్కానింగ్ సెంటర్లు, గవర్నమెంటు యూపీహెచ్‌సీ/పీహెచ్‌సీ వైద్యులకు లింగ నిర్ధారణ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో పరీక్షలు చేయడమే కాని ఫలితాలు చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొండా రాజీవ్‌గాంధీ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

జగదాంబ(విశాఖ) : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ శుక్రవారం సంస్థ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

17న అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలో గల తిరుమల విద్యాసంస్థలలో ఐదు నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకొనే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తిరుమలఈడీయూ.కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖపట్నం క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరు కావాలనుకొనే వారు ఆ క్యాంపస్‌లో అదే తేదీన నేరుగా సంప్రదించవచ్చన్నారు. 2023లో ఐఐటీ/ఎన్ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.

70 కిలోల గంజాయి స్వాధీనం

మాడుగుల రూరల్: ముకుందపురం పెట్రోల్ బంకువద్ద 70కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఐ పి.దామోదరనాయుడు తెలిపారు. బంకు వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీచేసి నట్టు చెప్పారు. పాడేరు నుంచి చోడవరం వైపు వస్తున్న కారును తనిఖీ చేయగా గంజాయి బయటపడినట్టు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు గ్రామానికి చెందిన నిందితుడు జనం జగన్నాథం(40)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. నిందితుడిని నుంచి గంజాయి, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద


సమావేశంలో మాట్లాడుతున్న కె.ఎస్.రాజు



పిల్లవానిపాలెంలో భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న కమలానంద భారతి

అనకాపల్లి: సామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత అని, సహేతుకమైన, న్యాయబద్ధమైన కోరికలను నెరవేర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కంప్ట్రోలర్ ఆడిట్ జనరల్ ఆఫ్ ఇండియా సీనియర్ ఆడిటర్ కె.ఎస్.రాజు తెలిపారు. స్థానిక గౌరీగ్రంథాలయంలో శుక్రవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి, వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశభక్తి, సమాజసేవలో స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామకృష్ణమిషన్ అనుబంధ సంస్థ విశాఖ యువ మహామండలి కార్యనిర్వాహక సభ్యుడు డి.ఎస్.మూర్తి మాట్లాడుతూ వ్యక్తిత్వాన్ని పెంచుకోవాలని సూచించారు. ఆత్మనూన్యత జాడ్యాన్ని వదిలించుకునేలా చేసిన వ్యక్తి స్వామివివేకానంద అని అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, కర్రి గంగాధర్, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కర్రి హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యతోనే సామాజ అభివృద్ధి

నర్సీపట్నం: సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సీబీసీఐడీ అడిషనల్ డీజీ కిల్లాడ సత్యనారాయణ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నర్సీపట్నం గ్రంథాలయంలో శుక్రవారం వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయానికి విలువైన పుస్తకాలు, గ్రూప్–1,2 స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి క్రమ శిక్షణతో చదువుపై దృష్టి సారిస్తే లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల్లో సైతం గతంతో పోల్చుకుంటే విద్యపై ఆసక్తి పెరిగిందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయాధికారి దయమంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మేలుకొలుపుల' మహా సమ్మేళనం

రావికమతం: పలు మండలాల మేలుకొలుపు బృందాల మహా సమ్మేళనాన్ని పిల్లవానిపాలెం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెల గంట పెట్టింది మొదలు గ్రామాల్లో హరి కీర్తనలు, రామ భజనలు చేస్తున్న భజన బృందాల సభ్యులు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం భువనేశ్వరి దేవి పీఠం నిర్వాహకులు కమలానంద భారతి స్వామి సనాతన ధర్మం గూర్చి వివరించారు. ప్రపంచ దేశాలకు హైందవ ధర్మం గూర్చి చాటి చెప్పిన ఘనత యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన స్వామి వివేకానందకే దక్కిందన్నారు.


వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీబీసీఐడీ అడిషనల్ డీజీ సత్యనారాయణ

పాడి రైతుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి

- ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ రామ్మోహన్‌రావు


పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న డీడీ రామ్మోహన్‌రావు, ఏడీ శ్రీనివాసరావు

నాతవరం: పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టరు రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని శృంగవరంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. లేగ దూడలను బాగా పెంచిన రైతులకు ఈప్రదర్శనలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈఏడాది లేగ దూడలు ప్రదర్శనలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.3లక్షలు విడుదల చేసిందన్నారు. ఇంతవరకు 18 ప్రదర్శనలు నిర్వహించామని, మిగతావి ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వైఎస్సార్ పశుబీమా కోసం పభుత్వం రూ.33 లక్షలు విడుదల చేసిందని తెలిపారు. ఈ పథకంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా ఆవులు, గేదెలకు ఆడ పెయ్యిలు జన్మించే ఇంజక్షన్లు ఇస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 6వేలకు పైగా ఇంజక్షన్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అనకాపల్లి జిల్లాలో 4వేల ఇంజక్షన్లు వేయాలన్నది లక్ష్యం కాగా, ఇంతవరకు 2,200 పైగా వేశామన్నారు. ప్రతి మండలంలో 30 నుంచి 40వరకు ఆడ పెయ్యిలు జన్మించినట్టు చెప్పారు. పాల ఉత్పత్తిని పెంచడంలో భాగంగా సంకర జాతి పశువులను పెంచేందుకు రైతుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్టు తెలిపారు.పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో పాయకరావుపేట పశుసంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాసరావు, నాతవరం శృంగవరం పశువైద్యాధికారులు మోక్షారెడ్డి శరణ్య, శృంగవరం వైఎస్సార్‌సీపీ నాయుకుడు కాళ్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- రైతులు 'ఈ పంట'లో నమోదు చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు
- యలమంచిలి మండలంలో పంట పొలాల పరిశీలన


కొక్కిరాపల్లిలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి: రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు చెప్పారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టిందని, రైతులందరూ వరి కుప్పల నూర్పులు వేగవంతం చేసుకోవాలని చెప్పారు.

ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల వద్ద 'ఈ పంట' నమోదు చేసుకోవాలన్నారు. రైతు భరోసా–పీఎం కిసాన్ రాని రైతులు ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ విత్తనాలు, పనిముట్లతో వ్యవసాయాన్ని సాగు చేయాలని, తక్కువ కాలంలో అధిక దిగుబడులు వచ్చే పంటలు సాగు చేయడంలో రైతులు ఉత్సాహం చూపాలని చెప్పారు. యలమంచిలి డివిజినల్ వ్యవసాయ సహాయక సంచాలకుడు రవి ప్రకాష్, మండల వ్యవసాయాధికారి మోహనరావు, వ్యవసాయ సహాయకులు స్వాతి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, స్థాయి సంఘ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నగర మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో 38 అంశాలతో పాటు 17 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా, వాటిని చర్చించి అన్ని అంశాలను ఆమోదించినట్టు చైర్‌పర్సన్ తెలిపారు.

ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.4.32 కోట్ల అభివృద్ధి పనులు, ప్రజారోగ్యానికి సంబంధించి పలు కార్యక్రమాలు, అదనపు కార్మికులను తాత్కాలికంగా సేవలు వినియోగించుకునేందుకు ఇతర కార్యక్రమాలకు సుమారు రూ.1.37 కోట్లు, రెవెన్యూ విభాగానికి సంబంధించిన లీజులు పొడిగింపు తదితర అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయస్థాయిలో విశాఖకు 4వ ర్యాంకు వచ్చినందుకు సహకరించిన విశాఖ నగర ప్రజలు, డిప్యూటీ మేయర్లు, స్థాయీ సంఘ సభ్యులు, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, పారిశుధ్య కార్మికులు, జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, సినీ, క్రీడా ప్రముఖులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణా, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, కార్యనిర్వాహక ఇంజనీర్లు సంతోషికుమారి, తారా ప్రసన్న, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య కొట్లాట

- వ్యక్తి మృతి.. పలువురికి గాయాలు


మృతి చెందిన నూకరాజు


నూకరాజు (ఫైల్)

పాయకరావుపేట: మండలంలో గల పెదరామభద్రపురం గ్రామంలో గురువారం రాత్రి ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య కొట్లాట జరగడంతో ఒక వ్యక్తి మృతి చెందాడని, మరికొందరికి గాయాలయ్యాయని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. పెదరామభద్రపురం సెంటరులో బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయి. గ్రామానికి చెందిన శీలి నూకరాజు కాళ్లకు చెప్పులతో విగ్రహాలు ఉన్న గట్టు మీదకు ఎక్కాడు. ఇది గమనించిన గంపల నూకరాజు చెప్పులతో ఎక్కకూడదని శీలి నూకరాజుకు చెప్పాడు. వీరిద్దరికీ మధ్య కొంతసేపు ఘర్షణ జరిగింది. అనంతరం ఇరువురి కుటుంబ సభ్యులు గొడవ పడ్డారు. రాత్రి 8 గంటల సమయంలో శీలి నూకరాజుతో పాటు పాయకరావుపేట నుంచి కొంతమంది వెళ్లి గంపల నూకరాజును కర్రలు, ఇనుప రాడ్లతో కొట్టడంతో నూకరాజు నేలపై పడిపోయాడు. మరికొంతమంది ఆపడానికి ప్రయత్నించగా వారిపై కూడా దాడి చేసి గాయపరచినట్టు సీఐ తెలిపారు. గంపల నూకరాజును తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. మృతుడు నూకరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు గంపల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహానికి తుని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. పెదరామభద్రపురం గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గాయపడిన వారిని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు.


తుని ఏరియా ఆస్పత్రి వద్ద విచార వదనంతో మృతుని భార్య, పిల్లలు

బెదిరింపులకు భయపడేది లేదు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- గంజాయి వ్యాపారులు, అయ్యన్న పాత్రుడిపై పోలీసులకు ఫిర్యాదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఎవరెన్ని బెదిరింపులకు పాల్పడినా భయపడేది లేదని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులను బెదిరిస్తున్న గంజాయి వ్యాపారులు, అయ్యన్నపాత్రుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ మేరకు టౌన్ పోలీసులకు ఆయన శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తలుచుకుంటే ఫుట్‌బాల్ ఆడతారన్న విషయాన్ని టీడీపీ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు గుర్తించుకోవాలని తెలిపారు. టీడీపీ నాయకుల ఇళ్లల్లో సోదాలు చేస్తే గంజాయి నిల్వలు బయటపడతాయని చెప్పారు. గంజాయి వ్యాపారంతో పడగలెత్తిన టీడీపీ నాయకులు మా పార్టీ సోషల్ మీడియా వారిని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని దోచుకున్న దొంగలు అయ్యన్న, చంద్రబాబు అని విమర్శించారు. అధికారంలోకి వస్తే పోలీసులను ఫుట్‌బాల్ ఆడతానని అంటున్నావు...పోలీసులు తలుచుకుంటే నిన్ను ఇప్పుడే ఫుట్‌బాల్ ఆడతారని అయ్యన్న పాత్రుడిని హెచ్చరించారు. 1989, 90లలో రౌడీయిజం చేసినట్టు ఇప్పుడు చెల్లదన్నారు. మాపార్టీ నాయకుల మీద దౌర్జన్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. అభివృద్ధి పనుల మీద స్టే తెచ్చారని, ఆ విషయాన్ని డైవర్ట్ చేయడం కోసం అయ్యన్నపాత్రుడు ఇలాంటి వేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇళ్లలో గంజాయి నిల్వలు ఉన్నాయన్నారు. వారి ఇళ్లను పోలీసులు సోదాలు చేయాలన్నారు. మూడు నెలల్లో అధికారంలోకి వస్తామని నీ ఇంటి గోడ మీద రాసుకో..30 ఏళ్లు అయినా టీడీపీకి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆయన అయ్యన్న పాత్రుడిని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

వెయ్యి లీటర్ల పులుపు, పరికరాలు ధ్వంసం


పులుపు, డ్రమ్ములతో రావికమతం పోలీసులు


పులుపును స్వాధీనం చేసుకున్న ఎస్ఐ సురేష్

రావికమతం: కుముందానిపేట గ్రామ శివారు తోటల్లో సారా తయారీ స్థావరంపై స్థానిక పోలీసులు శుక్రవారం దాడి చేసి, వెయ్యి లీటర్ల పులుపు, పరికరాలు ధ్వంసం చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని ముందస్తు సమాచారం అందడంతో ఎస్ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో కలిసిదాడులు చేశారు.సారా తయారీకి సిద్ధంగా ఉన్న పులుపు, తయారీకి ఉపయోగించేందుకు డ్రమ్ములను,పరికరాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు

రోలుగుంట: సారా తయారీ స్థావరాలపై స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ సిబ్బందితో కలసి శుక్రవారం దాడి చేశారు. పలు పొలం పాకల వద్ద ఉన్న 1200 లీటర్ల పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పండగ వేళ విషాదం

- విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


మృతుడు నాగేశ్

కోటవురట్ల: పండగవేళ ఆ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకొందామని భావించిన ఆ కుటుంబం పెద్దను మృత్యువు కబళించింది. గొట్టివాడ గ్రామానికి చెందిన రాచపతి నాగేశ్ (45) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తన పొలంలోని మకాంలో షెడ్‌లో బల్బు వెలగపోవడంతో నాగేశ్ హోల్డర్ విప్పి మరమ్మతు చేస్తుండగా షాక్ కొట్టింది. దీంతో ఎంసీబీ ఆఫ్ చేసి మళ్లీ రెండు వైర్లు పట్టుకునేసరికి తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేకలు విని పొలంలో ఉన్న రైతులు హుటాహుటిన అతని కోటవురట్లలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. నాగేశ్ వ్యవసాయంతో పాటు సరుగుడు కర్రల వ్యాపారం కూడా చేస్తుంటాడు. తన ఇద్దరు అమ్మాయిలను బాగా చదివిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంతలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. నాగేశ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఉమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ రమణయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి స్థానిక సీహెచ్‌సీకి తరలించారు.

క్లుప్తంగా

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తుమ్మపాల : ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్)ను ఫిబ్రవరి 29లోగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి వి.లక్ష్మీ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. జీవన, నాన్–ఎంప్లాయ్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ పింఛనుదారులు జీవన ధ్రువీకరణ నాన్– ఎంప్లాయిమెంట్‌లతో పాటు నాన్– రీమ్యారేజ్ ధ్రువీకరణ పత్రాలు కూడా జత చేయాలన్నారు. ధ్రువీకరణ పత్రాలు ఉప ఖజానాలు, మీసేవ కేంద్రాలు, ఇంటర్నెట్ కేంద్రాలు ద్వారా అందజేయ వలసిందిగా కోరారు. సకాలంలో అందజేయనట్లయితే ఏప్రిల్ నెల పింఛను నిలిపివేయబడుతుందని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు



కశింకోటలో కల్కి అవతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట : కశింకోటలోని రెండు వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. విష్ణుమూర్తి దశావతారాల్లో చివరిది అయిన కల్కి అవతారంలో స్వామి భక్తులకు శుక్రవారం దర్శనం ఇచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం, గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి వారిని కల్కి అవతారంలో పూలమాలలు, ఆభరణాలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన, పాశుర విన్నపం, తిరుప్పావై పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల అర్చకులు రేజేటి రామచరణాచార్యులు, సుబ్రహ్మణ్యం, గవరపేట వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూకాంబికకు ప్రత్యేక పూజలు



నూకాంబిక అమ్మవారి ఆలయంలో హోమం చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఆదిబాబు అమావాస్య యూత్, కంభంపాటి భాను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు యనమండ్ర శ్రీనివాస్, సందీప్ శర్మ అమ్మవారికి పాలు, పసుపు, కుంకుమ, పళ్లరసాలు, గంధంతో శుక్రవారం అభిషేకాలు, హోమం నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి పులిహోర, చక్రపొంగలి, అరిసెలు, పెరుగు గారెలు నైవేద్యంగా సమర్పించి, భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల తీర్థ మహోత్సవానికి ఏర్పాట్లు



తాళ్లపాలెంలో సీతారాముల తీర్థ మహోత్సవానికి చేస్తున్న ఏర్పాట్లు

కశింకోట : మండలంలోనే పెద్ద తీర్థంగా పేరొందిన తాళ్లపాలెంలోని సీతారాముల తీర్థ మహోత్సవానికి శుక్రవారం నుంచి సన్నాహాలు ప్రారంభించారు. ఈ నెల 21న తీర్థ మహోత్సవం జరగనుంది. పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం కూడలిలో ప్రవేశ ద్వారానికి, పాల కేంద్రం ప్రాంతంలో దేవతామూర్తుల కటౌట్లను, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయడానికి కర్రలు కట్టి ఏర్పాట్లు చేస్తున్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ‘ఎ’ పాజిటివ్–2 యూనిట్లు, ‘బి’ పాజిటివ్–18 యూనిట్లు, ‘ఓ’ పాజిటివ్–19 యూనిట్లు, ‘ఎబి’ పాజిటివ్–8 యూనిట్లు, ‘బి’ నెగెటివ్–1 యూనిట్, ‘ఓ’ నెగెటివ్–3 యూనిట్లు, ‘ఎబి’ నెగెటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 452 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 441 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో సత్తా చాటిన జట్లు



విజయం సాధించిన తీడ ఖో-ఖో పురుషుల జట్టుతో ఎంపీపీ లక్ష్మి, అధికారులు



మహిళా కబడ్డీ పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

కశింకోట : మండల స్థాయి ‘ఆడుదాం ఆంధ్ర’కార్యక్రమంలో నిర్వహించిన పోటీల్లో మూడు జట్లు ఫైనల్‌లో విజయం సాధించి నియోజక వర్గ స్థాయికి ఎంపికయ్యాయి. కశింకోటలోని బాలికల హైస్కూల్లో కబడ్డీ, ఖో–ఖో ఆటల్లో శుక్రవారం పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఖోఖో పురుషుల విభాగంలో తీడ, మహిళా విభాగంలో కొత్తపల్లి జట్లు, కబడ్డీలో వెదురుపర్తి మహిళా జట్టు విజయం సాధించాయి. కబడ్డీ పురుషుల జట్టు ఫైనల్స్ ఈ నెల 19న నిర్వహించనున్నట్లు పీడీ పెంటకోట కమల తెలిపారు. పోటీల్లో విజేత జట్లను ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఏఈవో మూర్తి తదితరులు అభినందించారు. పోటీలో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు. పోటీల్లో సచివాలయాల నుంచి 46 మహిళ, పురుష జట్లు పాల్గొన్నాయి. ప్రధానంగా మహిళా కబడ్డీ పోటీలను స్థానికులు ఎక్కువ మంది ఆసక్తిగా తిలకించి ఆనంద పరవశులయ్యారు.



పురుషుల కబడ్డీ పోటీ



పురుషుల ఖో-ఖో

ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన



వైద్య సేవలందిస్తున్న తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్

కశింకోట : మండలంలోని తీడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 212 మందికి సేవలందించారు. ఎంపీపీ కలగా లక్ష్మి శిబిరాన్ని సందర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగ గున్నయ్యనాయుడు, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, స్త్రీ వైద్య నిపుణురాలు విష్ణుప్రియ, కీళ్ల వైద్య నిపుణుడు ఎస్. గోపి, తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యుడు ఎన్. రమేష్, ఆప్తాలమిక్ సంధ్య హాజరై పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు, కళ్లద్దాల కోసం సిఫార్స్ చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సచివాలయం పరిధిలోని తీడ, చెరకాం గ్రామాల నుంచి గర్భిణులు, వికలాంగులు, పిల్లలు హాజరయ్యారు. ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సేవలందించారు.

20న గౌరీపరమేశ్వరుల మహోత్సవం



ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి : సుమారు 170 సంవత్సరాల చరిత్ర కలిగిన గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తునట్లు ఆలయ అధ్యక్షుడు వాకాడ బాబు తెలిపారు. సీతారామ కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. అనంతరం మహోత్సవ గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మద్దాల నూకరాజు, ఉపాధ్యక్షుడు శీరంశెట్టి నర్సింగరావు, సహాయ కార్యదర్శి పనసా శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, ఆలయ పెద్దలు దోమరౌతు రామారావు, మద్దాల కూర్మారావు, ముత్తా ఈశ్వరరావు, మద్దాల రమణబాబు, గుమ్మాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని చాటిన వివేకానందుడు



సమావేశంలో మాట్లాడుతున న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య



కశింకోటలో స్వామి వివేకానంద చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి



గాంధీనగరంలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

కశింకోట : కశింకోటలో పలుచోట్ల స్వామి వివేకానంద జయంతి ఘనంగా నిర్వహించారు. వివేకానంద హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె. విష్ణుమూర్తి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ఇతర దేశాల్లో చాటి దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశారని కొనియాడారు. అదనపు ఎస్‌ఐ జె. నాగేశ్వరరావు ప్రతిభావంతులైన విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరించారు. ముగ్గులు, గాలి పటాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద స్వామి వివేకానంద విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. దివంగత మాజీ ఉప సర్పంచ్ వి. రామ్‌ప్రసాద్ కుమార్తె హారికా ఆదిత్య శరవణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుల్లేపల్లి వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, స్థానికులు పూలమాల వేసి నివాళులర్పించారు. పరిషత్ గౌరవాధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అనకాపల్లి : నేటి యువత స్వామి వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని 10వ జిల్లా అదనపు న్యాయమూర్తి ఎన్.శ్రీవిద్య అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 161వ జయంత్యుత్సవాన్ని పురస్కరించుకుని వివేకానంద చిత్రపటానికి శుక్రవారం ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానంద అడుగుజాడల్లో నేటి యువత నడవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి జి.గంగరాజు, సెకండ్ ఏడీఎం న్యాయమూర్తి బీవీ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు పీవీఎస్‌ఏ మోహన్‌రావు, కేలం చంద్రశేఖర్, విశాఖ, గాజువాక న్యాయవాదులు పాల్గొన్నారు.

వివేకానందుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..

అనకాపల్లి : వివేకానందుని ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. అనకాపల్లి– చోడవరం రహదారిలో గల గాంధీనగరంలో శుక్రవారం 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివేకానందునికి నివాళి అర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు. పట్టణంలో వివేకా నందచారిటబుల్ ట్రస్టు ఆవరణలో జరిగిన వేడుకల్లో వివేకానందునికి ఎంపీ సత్యవతి నివాళులర్పించారు. జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, డీఆర్‌డీఏ డీపీఎం కుమారస్వామి, జీవీఎంసీ ఏపీడీ వీకే దొర, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు. తుమ్మపాల చిన్నయ్యపేటలో వివేకానంద జయంతి వేడుకల్లో భాగంగా ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ వివేకానందుని విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్లో వాసవీ, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలు జరిగాయి. పట్టణంలోని గొల్లవీధిలో వివేకానంద విగ్రహానికి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణంలో కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ హాలులో హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు జరిగాయి. కళాశాల కరస్పాండెంట్ కె. జనార్దన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివేకానంద చారిటబుల్ ట్రస్టులో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ సత్యవతి

అభివృద్ధి పనులకు శ్రీకారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి : రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. నియోజకవర్గంలో రూ.కోటీ 45 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్లమెంట్ పరిధిలో సంక్షేమాభివృద్ధికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. గ్రేటర్ విలీన గ్రామమైన వల్లూరులో రూ.70 లక్షలతో మహిళా సాధికార సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఎస్సీ వసతి గృహంలో రూ.20 లక్షల స్టడీ హాలు, రూ.5 లక్షలతో వసతిగృహ మరమ్మతులకు కేటాయించినట్లు చెప్పారు. బీసీ వసతిగృహంలో రూ.20 లక్షలతో స్టడీహాలు, ముదిరాజ్ సంఘ భవనానికి రూ.30 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కార్పొరేటర్లు మందపాటి సునీత, కొణతాల నీలిమ, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, జెడ్సీ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



ముగ్గులను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి : ఓటు హక్కు వజ్రాయుధమని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. పట్టణంలో జీవీఎంసీ గవరపాలెం చిన హైస్కూల్లో శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళలకు నియోజకవర్గ స్థాయి రంగవల్లుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు పలుచోట్ల ఓటుహక్కుపై కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈపోటీల్లో ప్రథమస్థానాన్ని తుమ్మపాలకు చెందిన మాదేటి తనుశ్రీ దక్కించుకోగా, ద్వితీయ స్థానాన్ని కశింకోట బీఎల్వోలు, తృతీయ స్థానం గవరపాలేనికి చెందిన గోదాల లక్ష్మి దక్కించుకున్నారు. విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్‌రావు, ఆర్‌ఐ రమేష్, వెలుగు ఏపీఎం సింహాచలం, అంగన్‌వాడీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శశికళ, ఎంఈవో–1 చిట్టిబాబు, జీవీఎంసీ ఏపీడీ వీకే దొర, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నేడు గొలగాం, గోపాలపురం గ్రామాల్లో వికసిత్ భారత్

అనకాపల్లి : మండలంలో వికసిత్ భారత్ కార్యక్రమం శనివారం ఉదయం 9 గంటలకు గొలగాం, మధ్యాహ్నం 3 గంటలకు గోపాలపురం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని ఆయన తెలిపారు.

అభివృద్ధి పరవళ్లు



మెయిన్‌రోడ్డులో కిక్కిరిసిన వస్త్ర దుకాణం

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాల విభజన నేపథ్యంలో అనకాపల్లి పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గతంలో కంటే ఇటీవల పట్టణ రూపురేఖలు మారుతున్నాయి. ఇప్పటికే పలు వస్త్ర దుకాణాలు, షాపింగ్‌మాల్స్, విద్య, వైద్యం, వ్యాపార రంగాలతో పాటు అన్ని విభాగాల్లో అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. చిన్న,పెద్ద కంపెనీల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

రియల్ ఎస్టేట్ రంగం ఉరుకులు..

జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం గణనీయంగా అభివృద్ధి చెందింది. మండల పరిధిలో శంకరం, రేబాక, కాపుశెట్టిపాలెం, తుమ్మపాల, కొత్తూరు, సిరసపల్లి, మారేడుపూడి, పిసినికాడ గ్రామాల్లో భూమి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బడా వ్యాపారులు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు సాగిస్తున్నారు. పై ప్రాంతాల పరిధిలో గృహాల అద్దెలు ఎక్కువగా పెరిగాయి. దీంతో పాటు ఈ ప్రాంతంలో బేకరీలు, హోటళ్లు, హోల్‌సేల్ దుకాణాలు అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రశాంతమైన వాతావరణం...

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రజలు వ్యక్తిగత వ్యాపారాల నిమిత్తం అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగిస్తారు. పార్లమెంట్ పరిధి, కేంద్రంలో బెల్లం మార్కెట్‌కు ద్వితీయస్థానం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, షుగర్ ఫ్యాక్టరీలు, సువిశాలమైన జాతీయ రహదారి కలిగి ఉంది. వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ఇక్కడే నివస్తున్నారు. కాలుష్యం తక్కువగా ఉంటుంది. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలు జీవించేందుకు జిల్లా ఎంతగానో అనువుగా ఉండడంతో ఈ ప్రాంతం పట్ల ప్రజలు మక్కువ చూపుతున్నారు.